కథ

# ఓ రోడ్డు కథ

డి.వి.డి. ప్రసాద్

''మాస్టర్‌గారూ! ఈ విషయంలో కూడా మీరే కల్పించుకోవాలి. లేకపోతే పనులు జరగవు'' అన్నాడు సోమనాథం. అతను ఆ కాలనీలో సొసైటీకి సెక్రటరీ.

''అవును పంతులుగారూ! చాలా రోజుల నుండి మూలపడి ఉన్న బోర్‌వెల్స్ మళ్ళీ మీ వలనే పని చేసాయి. లేకపోతే మొన్నటి ఎండాకాలం చాలా యిబ్బంది పడేవాళ్లం. మీరు చొరవ తీసుకోవడం వల్ల రిపేరు అయిందికానీ, లేకపోతే మరో ఏడాది వరకూ వాటిని ఎవరూ రిపేరు చేయటానికి వచ్చుండే వాళ్ళు కాదు. అందుకని ఈ భారం కూడా మీ మీద వేసుకోవాలి'' అన్నాడు ఆ కాలనీలో చాలా రోజుల నుండి ఉంటున్న కృష్ణమూర్తి, రామారావుని ఉద్దేశించి.

''ఈ విషయమై ఈ వారం కాలనీలో మీటింగ్ పెట్టి ఓ నిర్ణయం తీసుకోవాలి. అందర్నీ కూడగట్టుకుని పని చేయాలి'' అన్నాడు రామారావు.

''ఎప్పుడో ఎందుకు? రేపెలాగూ ఆదివారం. సాయంకాలం నాలుగుకల్లా సమావేశమవుదాం. అందరూ చర్చించి సరైన నిర్ణయం తీసుకుందాం'' అన్నాడు సోమనాథం.

రామారావు ఆ టౌన్‌లో కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. వాళ్లుండే కాలనీ టౌన్‌కి దూరంగా ఓ మూలగా ఉంది. మున్సిపాలిటీ పరిధిలోకి రానందువలన ఎవరూ పట్టించుకోవడం లేదు. అయితే రామారావుకి తెల్సిన వ్యక్తి ఒకరు ఆ డిపార్ట్‌మెంట్‌లో వుండటం వలన బోర్‌వెల్స్ రిపేర్ అయ్యాయి. అంతేకాక రామారావు ఓ మంచి రచయిత కావడం వలన, చాలామందితో పరిచయాలున్నాయి. అందుకే అతనంటే కాలనీలోని వాళ్లందరికీ గౌరవం, మంచి గురి కూడా!

అనుకున్నట్లుగానే ఆరోజు సాయంకాలం అందరూ సమావేశమయ్యారు.

అందర్నీ ఉద్దేశించి సోమనాథం చెప్పాడు.

''ఎన్ని ప్రయత్నాలు మనం చేసినా, వినతి పత్రాలు యిచ్చినా కూడా మన కాలనీకి రోడ్డు మాత్రం యింతవరకూ వేయలేదు. మున్సిపాలిటీ పరిధిలోకి రాకపోవడంతో వాళ్లు పట్టించుకోవడం లేదు. గ్రామ పంచాయితీ ఏరియాలో ఉన్నా ఊరికి దూరంగా ఉండటంతో వాళ్ల ఫండ్స్ అన్నీ గ్రామంలోనే ఖర్చు పెడుతున్నారుగానీ యిక్కడ రోడ్డు గురించి పట్టించుకోవడం లేదు. రెంటికీ చెడ్డ రేవడిలా తయారైంది మన పరిస్థితి. సరైన రోడ్డు లేకపోవడంతో మనకి నానా అవస్థగా ఉంది. ఆఫీసుకెళ్లాలన్నా, స్కూలు, కాలేజీల కెళ్లాలన్నా, స్టేషన్, మార్కెట్‌గానీ, బస్టాండ్, హాస్పిటల్ కెళ్లాలన్నా చాలా యిబ్బందిగా ఉంది. అందువల్ల ఏం చేస్తే రోడ్డు పడుతుందో ఆ విషయమై తీవ్రంగా ఆలోచించాలి యిప్పుడు మనం.''

''నిజమే! రోడ్డు లేకపోవడం వల్ల మనకి చాలా యిబ్బంది అవుతోంది. రాజకీయ నాయకులు ఓట్లు కోసం వచ్చేటప్పుడు వాగ్దానాలు చేసినా, మళ్ళీ ఐదేళ్ల తర్వాతే కనబడేది! మన కాలనీని మునిసిపాలిటీలోకి చేరుస్తామన్నారు. అదీ అంతే! అందుకే యీ విషయంపై మరింత చర్చ జరిపి ఓ నిర్ణయం తీసుకోవాలి'' అన్నాడు కృష్ణమూర్తి.


కొంతమంది యువకులు ధర్నా, నిరాహార దీక్ష చేపడదామని అన్నారు.

అప్పుడు రామారావు లేచి,

''ఆగండి, నేను చెప్పేది వినండి. ధర్నా, నిరహార దీక్ష చేస్తే ఎంతకాలం చెయ్యగలం? ఒకవేళ ఎక్కువ రోజులు చేయగలిగినా, వాళ్లు హామీ యిచ్చి విరమింపచేస్తారు. తర్వాత కథ మళ్లీ మామూలే!'' అన్నాడు.

''అయితే ఏం చేయాలి?'' యీ ప్రశ్న అందరిదీను!

''మనం ఒకరి మీద ఆధారపడినంతవరకూ మన పని జరగదు. మనం ప్రభుత్వం మీదగానీ రాజకీయ నాయకుల మీదగానీ నమ్మకం ఉంచితే లాభం లేదు. మన రోడ్డు మనమందరం కలిసి నిర్మించుకుందాం. మన కాలనీ వాళ్లందరూ కలిసి చందా వేసుకుని, వీలైతే శ్రమదానం చేసి రోడ్డు వేద్దాం. అయితే దీని బాధ్యత మనలో కొందరు స్వీకరిం



చాలి. ఈ పనికోసం ప్రత్యేకంగా ఓ కమిటీ ఏర్పాటుచేసి ఓ నలుగురయిదుగురు బాధ్యత స్వీకరించాలి. అయితే ఒక మాట! ఈ పని ఏ ఒక్కరి వల్ల జరగదు. అందరి సలహాలు, సహకారాలు కావాలి. ఈ మహత్కార్యం కోసం అందరూ తమ వంతు సహకారం అందించాలి, తగిన కృషి చేయాలి'' అన్నాడు రామారావు ఉపన్యాస ధోరణిలో.

''చాలా బాగుంది, మీ ఆలోచన. అయితే ఎంత ఖర్చవుతుందో! మనం భరించగలమా?'' సందేహం వ్యక్తం చేశాడు రాజారావు. అతనో రిటైర్డ్ టీచర్.

''అంత డబ్బులు ఎలా సమకూరుతాయి? ప్రభుత్వ సహకారం లేకుండా మనమీ పని అసలు చేయగలమా?'' అన్నాడు జగన్నాథం. అతను ఓ యువ కాంట్రాక్టర్.

''ఎందుకు చేయలేం? మన కాలనీ అంతా కలిపి ఓ అరవై యిళ్ల వరకూ ఉన్నాయి. తలో మూడు వేలు చొప్పున వేసుకుంటే సరి!'' అన్నాడు రామారావు.

అతని వంక ఉత్సాహంగా చూశారంతా!

అతనే మళ్లీ అన్నాడు.

''అందరూ యీ ప్రతిపాదనని ఆమోదిస్తే నాకు తెల్సిన ఓ ఇంజినీర్ ఉన్నాడు. అతన్ని పిలిపించి ఓ ఎస్టిమేషన్ తయారు చేద్దాం. దాన్ని బట్టి మనకి, ఎంత ఖర్చవుతుందో, యింటికి ఎంత చొప్పున చందా వేయాలో నిర్ణయం చేసుకోవచ్చు''

''మీ ఐడియా చాలా బాగుంది మాస్టర్ గారూ! మీరే ఈ బాధ్యత కూడా స్వీకరించాలి. ఈ కమిటీకి మీరే ముఖ్యులుగా ఉండాలి'' అన్నాడు సోమనాథం.

''సోమనాథంగారిని నేను బలపరుస్తున్నాను. రామారావుగారే యీ కమిటీకి హెడ్‌గా ఉంటారు. మరో నలుగురు మన కమిటీలో చేరాలి, నేను, సోమనాథం గారూ కాకుండా'' అన్నాడు కృష్ణమూర్తి.

అందరూ ఈ నిర్ణయం పట్ల తమ ఆమోదం ఏకగ్రీవంగా తెలిపారు.

రామారావు ఆ బాధ్యత స్వీకరించడానికి తన సంసిద్ధత వ్యక్తం చేసాడు. మరో నలుగురు యువకులు ముందుకు వచ్చారు.

మొత్తం మీద 'రోడ్డు కమిటీ' తన పని హుషారుగా ప్రారంభించింది.

ఆ మరుసటి రోజే ఇంజినీర్‌ని పిలిపించి బడ్జెట్ తయారు చేసారు. దాని ప్రకారం, ఇంటికో మూడు వేల అయిదొందల చొప్పున వసూలు చేయడానికి నిర్ణయం అయింది.

పనులన్నీ చాలా చురుగ్గా సాగాయి. అందరూ తమ వంతు సహకారం అందజేసారు. మొత్తానికి ఓ రెండు నెలల్లో అందరి కలలు సాఫల్యం చేస్తూ చక్కటి రోడ్డు తయారైంది.

కాలనీలో వయోవృద్ధుడైన రంగారావుగారి చేత పూజ చేయించి ప్రారంభోత్సవం చేయించారు. తమ పని శుభప్రదంగా నెరవేరినందువలన అందరూ చాలా సంతోషంగా ఉన్నారు.

ఆ మరుసటి రోజు సమావేశమై అందరూ రామారావు తదితరులను అభినందనలతో ముంచెత్తారు.

తమ దీర్ఘకాలిక సమస్య యిలా చక్కగా పరిష్కారం అవడంతో అందరూ సంతోషంగా ఉన్నారు.

ఆనందంగా 'టీపార్టీ' చేసుకున్నారు.

ఓ వారం తర్వాత, ఓ సాయంకాలం కాలేజీ నుండి వచ్చి కుర్చీలో కూర్చుని రిలాక్సై టీ తాగుతుండగా సోమనాథం వచ్చాడు.

''మాస్టార్‌గారూ! మీరీ మాట విన్నారా?'' అన్నాడు కూర్చుంటూ.

రామారావుగారి భార్య వచ్చి పలకరించి టీ యిచ్చిందతనికి.

''అదే మాస్టర్‌గారూ! మన జగన్నాథం లేడూ, కాంట్రాక్టర్? మన రోడ్డు నిర్మాణంలో కూడా చాలా ఏక్టివ్‌గా పని చేసాడు''

''అవును...అయితే..''

''నిన్న నేను ట్రెజరీకి వెళ్తే తెలిసింది. విశేషమేమిటంటే మన కాలనీకి రోడ్డు వేయటానికి చాలా రోజుల క్రిందటే గ్రాంట్ వచ్చిందిట. మనకీ విషయం తెలీదు.

మన కాలనీ రోడ్డు నిర్మాణానికి టెండరు జగన్నాథం చేజిక్కించుకున్నాడట. తనే రోడ్డు వేసినట్లు అయిదు లక్షలకి బిల్ సబ్‌మిట్ చేసి శాంక్షన్ చేయించుకున్నాడట కూడా! ఈ విషయం మాటల సందర్భంలో అక్కడ పనిచేస్తున్న నా స్నేహితుడి ద్వారా తెలిసింది.

ఎప్పుడూ ఏ పనికి పెద్దగా శ్రద్ధ చూపని, ఎప్పుడూ మీటింగ్‌లకి సరిగ్గా హాజరుకాని అతను, యీ రోడ్డు విషయంలో అంత శ్రద్ధ చూపడం నాకప్పుడు చాలా ఆశ్చర్యమనిపించింది. చివరికి యిప్పుడు అసలు కారణం తెలిసింది. మనమంతా చందా వేసుకుని, రోడ్డు వేసుకుంటే అది చూపించి బిల్ చేసుకుని లబ్ధి పొందాడతను. చూడండి'' అన్నాడు సోమనాథం.

''ఆ..'' అది విని నోరెళ్లబెట్టాడు రామారావు. క్షణంలో తేరుకుని..

''పదండి..అందరం కలిసి అతన్ని నిలదీద్దాం!'' అన్నాడు లేస్తూ.

''ఇంకెక్కడి జగన్నాథం, అతను యిక్కడ యిల్లు ఖాళీ చేసి అద్దెకిచ్చి టౌన్‌కి షిఫ్ట్ అయి వారం రోజులయింది'' అన్నాడు సోమనాథం.

''ఆ..'' అని నిర్ఘాంతపోయి తిరిగి కుర్చీలో కూలబడ్డాడు రామారావు. ☆



## అపూర్వ కలయిక

**'బ్రైడ్ అండ్ ప్రెజుడిస్' చిత్రం అటు హాలీవుడ్, ఇటు బాలీవుడ్ నటీనటుల అపూర్వ కలయికతో కళాఖండంగా రూపుదిద్దుకుంటోంది. ఐశ్వర్యరాయ్ నటనే ఈ చిత్రానికి అసెట్ అని చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఐశ్వర్యారాయ్ నటనపైనే ఈ చిత్రం మార్కెట్ ఆధారపడి ఉంటుందని అంటున్నా, ఇతర నటీనటుల ప్రాధాన్యాన్ని కూడా తీసిపారేయలేం అంటున్నారు. ఇదిలా ఉంటే ఐశ్వర్యారాయ్ సినిమాల్లో నటిస్తూనే వ్యాపారం కూడా చేయాలనుకుంటోంది. ఇప్పుడామె రాజస్థాన్‌లో ఓ పవర్‌ప్లాంట్ నిర్మించబోతోంది.**